RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 97 | ఏప్రిల్ 27 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
| --- | --- | --- | --- | --- | --- | --- |
| Nizamabad | Vol: 03 | Vol: 97 | April 27 Monday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఫీజుల దోపిడీని సహించేది లేదు

2

## ట్రంప్ హాజరైన ప్రోగ్రాంలో

# ఆగంతకుడి కాల్పులు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

అమెరికాలో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందు కార్యక్రమంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హాజరైన ఈ కార్యక్రమంలో ఒక్కసారిగా కాల్పులు చోటు చేసుకున్నాయి. దాంతో ఒక్కసారిగా భయాందోళనలు వ్యక్తమయ్యారు. అయితే, కార్యక్రమానికి ముందు ట్రంప్ ప్రెస్ సెక్రెటరీ కరోలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కరోలిన్ మాట్లాడుతూ ట్రంప్ ప్రసంగం ఉత్సాహంగా ఉండబోతోందుని.. ఈ రాత్రి కొన్ని షాట్స్ వినిపిస్తాయంటూ వ్యాఖ్యానించింది. ఆమె వ్యాఖ్య వెనుక ఉద్దేశం ట్రంప్ ప్రసంగం ఆకర్షణీయంగా ఉండబోతుందని అయినా.. కాల్పుల ఘటనతో ఆ వ్యాఖ్యలకు కొత్త అర్థాలు వెలుగులోకి వస్తున్నాయి. కార్యక్రమం

మిగతా 2వ పేజిలో..

# పెట్రోల్ బంక్‌ల్లో నోస్టాక్‌లు

## బోర్డులు కనిపిస్తుండడంతో వెనుదిరుగుతున్న వాహనదారులు



**హైదరాబాద్ జనసంఘర్షణ**

రాష్ట్ర రాజధాని హైదరాబాద నగరంలో ఇంధన కొరత మళ్లీ మొదలైంది. రెండు, మూడు వారాల క్రితం చోటు చేసుకున్న పరిణామాలు మళ్లీ కనిపిస్తున్నాయి. నగరంలోని పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్ని పెట్రోల్ బంకులు ఇప్పటికే మూతపడగా, కొన్ని బంకుల్లో డీజిల్ నో స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయి. మరికొన్ని బంకుల్లో కేవలం పెట్రోల్ మాత్రమే ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం ఉదయం భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల వాహనదారులు నిల్చున్నారు. ఉదయం నుండే పెట్రోల్, డీజిల్ కోసం క్యాన్లతో బారులు

మిగతా 2వ పేజిలో..

# మూడు పాత్రలు పోషించాం

## బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్ జనసంఘర్షణ**

ఈ 25 ఏండ్ల కాలంలో మూడు పాత్రలు సమర్థవంతంగా పోషించామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. భవిష్యత్‌లో మళ్లీ అధికారంలోకి వచ్చి బ్రహ్మాండమైన పాలన అందిస్తామని ఆయన అన్నారు. కేటీఆర్ సమక్షంలో హుజూర్‌నగర్ నియోజకవర్గ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు పిల్లుట్ల రఘు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. మండుటెండలో మీరు ఇంత దూరం రావడం చాలా సంతోషంగా ఉంది. బ్రహ్మాండమైన పోరాట స్ఫూర్తితో దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం, మంత్రులను ఎదుర్కొంటాం.. మాకు

మిగతా 2వ పేజిలో..

## ఇంధనం అందుబాటులోకి

# తీసుకురావాలి



**అమరావతి జనసంఘర్షణ**

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్ దొరకక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల స్టాక్ లేక బంకులు మూతపడటంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో అత్యవసరంగా మాట్లాడారు. ప్రజలు భయపడి ఒకేసారి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం వల్ల డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని అధికారులు సీఎంకు తెలిపారు. స్టాక్ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వెంటనే ఇంధనం అందుబాటులోకి తీసుకురావాలని సీఎం స్పష్టం చేశారు. రికార్డు స్థాయిలో అమ్మకాలు.. అధికారులకు డెడ్‌లైన్

సాధారణ రోజులతో పోలిస్తే శనివారం ఒక్కరోజే పెట్రోల్, డీజిల్ అమ్మకాలు 50 శాతం కంటే ఎక్కువగా జరిగాయి. కొరత వస్తుందన్న

మిగతా 2వ పేజిలో..

# నేడు ఉపరాష్ట్రపతి పర్యటన

**శ్రీకూర్మం, అరసవల్లి క్షేత్రాలను పరిశీలించిన ఏఎస్ఎల్ బృంద**

**కేంద్ర అధికార బృందంతో కలిసి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ ఆరా**

**ముస్తాబవుతున్న ఆధ్యాత్మిక క్షేత్రాలు**



**శ్రీకాకుళం జనసంఘర్షణ**

భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేస్తున్నారు. సోమవారం ఉదయం 10.50 నిమిషాలకు ఉపరాష్ట్రపతి రానుండటంతో జిల్లా యంత్రాంగం, కేంద్ర భద్రతా విభాగం సంయుక్తంగా 'అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్' ని ఆదివారం ఉదయం నిర్వహించాయి. డచ్ బంగ్లా నుంచి పర్యటన సాగే మార్గాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, కేంద్ర హోంశాఖ, ఉప రాష్ట్రపతి సెక్రటేరియట్ అధికారులు సమీక్షించారు. ఈ పర్యటనలో ఉప రాష్ట్రపతి కార్యాలయానికి చెందిన కీలక అధికారులు పాల్గొన్నారు. ప్రోటోకాల్ ఆఫీసర్ అమిత్ శర్మ, అశుతోష్ లతో పాటు సిఆర్పిఎఫ్ 2 ఇన్ కమాండ్ (2ఐసి) ధర్మబీర్ జాకర్ క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా

మిగతా 2వ పేజిలో..

# ఇరాన్ దాడిలో అమెరికాకు తీవ్రనష్టం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ జరిపిన దాడులతో మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలకు ఊహించిన దానికంటే ఎక్కువ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ నష్టం విలువ బిలియన్ల డాలర్లలో ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం తర్వాత ఇరాన్ దళాలు పలు దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. కమాండ్ సెంటర్లు, రన్‌వేలు, రాడార్ వ్యవస్థలు, విమానాలు దెబ్బతిన్నాయి. పాత ఫైటర్ జెట్ కూడా అమెరికా రక్షణ వ్యవస్థలను దాటడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జరిగిన నష్టంపై పూర్తి సమాచారం ఇవ్వడానికి రక్షణ శాఖ నిరాకరిస్తోంది. దీనిపై రాజకీయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. భారీ బడ్జెట్ కోరుతున్న సమయంలో వివరాలు దాచడం సరైంది కాదని విమర్శలు వినిపిస్తున్నాయి.

# పెట్రోల్ బంక్‌ల్లో నోస్టాక్‌లు

**మొదటిపేజీ తరువాయి..** తీరారు. పెట్రోల్ బంకు సిబ్బందితో వాహనదారులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఉద్రిక్త వాతావరణం సద్దుమణిగింది. పోలీసుల పర్యవేక్షణలో బంకు సిబ్బంది డీజిల్ నింపి పంపించారు. రెండు, మూడు వారాల క్రితం వాహనదారులు ప్రతి పెట్రోల్ బంకు వద్ద బారులు తీరారు. గంటల తరబడి పెట్రోల్ కోసం నిలబడ్డారు. ఆ పరిస్థితి ఒకట్రెండు రోజులు మాత్రమే ఉంది. ఆ తర్వాత మళ్లీ సాధారణ పరిస్థితి ఏర్పడింది. మళ్లీ నేటి నుంచి ఇంధన కొరత ఏర్పడిందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు మరింత ఆందోళనకు గురవుతున్నారు.

## ఇంధనం అందుబాటులోకి తీసుకురావాలి

**మొదటిపేజీ తరువాయి..** ప్రచారంతో ప్రజలు బంకుల వద్ద క్యూ కట్టడం వల్ల నిల్వలు త్వరగా అయిపోతున్నాయి. సుమారు 400 పైగా బంకులు మూతపడటంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సరఫరాలో ఉన్న అడ్డంకులను తొలగించి పరిస్థితిని చక్కదిద్దాలని అధికారులను ఆదేశించారు. దీనిపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను ఈరోజు సాయంత్రం లోపు తనకి సమర్పించాలని గడువు విధించారు. పెట్రోల్ కొరత ప్రభావం సామాన్యులతో పాటు ఆక్వా సాగు చేసే రైతులపై కూడా పడింది. డ్రమ్ముల ద్వారా ఇంధనం కొనే రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం సూచించారు. కలెక్టర్లు మరియు మత్స్యశాఖ అధికారులు కలిసి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. బంకుల వద్ద రద్దీని నియంత్రించి, ప్రతి ఒక్కరికీ ఇంధనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలతో త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ సరఫరా సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉంది.

# ట్రంప్ హాజరైన ప్రోగ్రాంలో ఆగంతకుడి కాల్పులు

**మొదటిపేజీ తరువాయి..** జరుగుతున్న సమయంలో ఒక వ్యక్తి అకస్మాత్తుగా కాల్పులకు దిగాడు. భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపినట్లు సమాచారం. అయితే, ఆ అధికారి బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించి ఉండటంతో ప్రమాదం తప్పింది. ఘటనతో అక్కడ కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ సిబ్బంది వెంటనే స్పందించి ట్రంప్‌ను భద్రతా వలయంలోకి తీసుకుని వేదిక వెనుక భాగం ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చిన అధికారులు దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై స్పందించిన ట్రంప్ తనపై హత్యాయత్నం జరిగిందని ఆరోపించారు. ఇక లీవిట్ చేసిన వ్యాఖ్యలు, అనంతరం జరిగిన కాల్పుల ఘటన మధ్య ఉన్న యాదృచ్ఛిక పోలికపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ సాగుతోంది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరూ తీవ్రంగా గాయపడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనపై సంబంధిత అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మూడు పాత్రలు పోషించాం

**మొదటిపేజీ తరువాయి..** అండగా నిలబడండి అంటున్న మీ అందరికి హృదయపూర్వక ధన్యవాదాలు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హుజుర్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు 70 వేల ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 14 వేల ఓట్లు అదనంగా వచ్చాయి. అంటే మన బలం 84 వేలకు చేరింది. నాటి ఎన్నికల్లో ఓటమి పాలైన వ్యక్తి పార్టీని వదిలిపెట్టి పోయినా మీరు వదిలి పెట్టకుండా సింహాల మాదిరి పోరాటం చేస్తున్నారు. కానీ ఆయన సొంతూరిలో కూడా సర్పంచ్‌ను గెలిపించుకోలేకపోయాడు. అనామాకుడిగా వచ్చాడు.. అనామాకుడిగానే మిగిలిపోతాడు అని కేటీఆర్ అన్నారు. 2001లో 25 ఏండ్ల కిందట స్వర్గీయ మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జలదృశ్యంలో ఆశ్రయమిస్తే గులాబీ జెండా ఎగిరింది. ఏప్రిల్ 27, 2026 నాటికి 25 వసంతాలు పూర్తి చేసుకుని 26వ ఏట అడుగుపెట్టబోతోంది. దేశంలో ఏ పార్టీకి లేని విశిష్టత మన పార్టీకే ఉంది. 15 ఏండ్లు ఉద్యమ పార్టీగా, 10 ఏండ్లు అధికార పార్టీగా, ఇప్పుడు ప్రతిపక్ష పార్టీగా.. మూడు పాత్రలు సమర్థవంతంగా పోషించిన ఒకే ఒక్క పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని కేటీఆర్ పేర్కొన్నారు.

# నేడు ఉపరాష్ట్రపతి పర్యటన

**మొదటిపేజీ తరువాయి..** నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా పోలీసు యంత్రాంగానికి కీలక సూచనలు చేశారు. నగరంలోని మిల్ జంక్షన్ మీదుగా నేరుగా శ్రీకూర్మం చేరుకున్న బృందం, ఆలయ పరిసరాలను పరిశీలించింది. ఆలయ ప్రవేశ ద్వారం, ప్రాంగణం, గర్భాలయ పరిసరాలను కేంద్ర అధికారులు తనిఖీ చేశారు. ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికే పాయింట్ నుంచి దర్శనం ముగించుకుని తిరిగి వెళ్లే వరకు ప్రతి అడుగును భద్రతా కోణంలో విశ్లేషించారు. ఆలయ విశిష్టతను ఉప రాష్ట్రపతికి వివరించే తీరుపై ఈవోకు పలు సూచనలు చేశారు. అనంతరం అరసవల్లి క్షేత్రానికి చేరుకున్న అధికారులు, ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు ఉన్న మార్గాలను తనిఖీ చేశారు. ఆలయ ప్రాంగణంలో పుష్పాలంకరణ, పారిశుధ్యం మెరుగుపరచాలని, వీవీఐపీ పర్యటన సమయంలో సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా రద్దీని నియంత్రించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వి.ఐ.పి.లు ఆలయానికి చేరుకునే మార్గంపై ప్రత్యేక నిఘా ఉండాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్, ఆర్‌డీఓలు కె. సాయి ప్రత్యూష, కృష్ణమూర్తితో పాటు అరసవల్లి ఈవో ప్రసాద్ రావు, శ్రీకూర్మం ఈవో వాసు దేవరావు, అరసవెల్లి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, పలువురు జిల్లా అధికారులు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నారు.

## ఫీజుల దోపిడీని సహించేది లేదు

: తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ వ్యాపారంగా మారిపోయిందని, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల అడ్డగోలు దోపిడీని ఇకపై సహించేది లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఆదివారం ఇందిరా పార్క్ వద్ద టీఆర్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన "మహాధర్నా" సక్సెస్ అయింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తల్లిదండ్రులు, విద్యార్థులు, యువత ఈ ధర్నాకు తరలివచ్చారు. ప్రభుత్వ తీరుకు, కార్పొరేట్ యాజమాన్యాలకు వ్యతిరేకంగా ధర్నా ప్రాంగణం నినాదాలతో హోరెత్తింది. ధర్నాను ఉద్దేశించి తీన్మార్ మల్లన్న అత్యంత ఘాటుగా ప్రసంగించారు. కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. "తొక్కి నారా తీయండి.. ఎవరైనా కేసులు పెడితే ఏ1 (ూ1) నిందితుడిగా నేనే ఉంటా.. పేదవాడి చదువుతో చెలగాటమాడితే ఉరికిచ్చి కొడతాం" అని హెచ్చరించారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా వ్యాపార ధోరణిలో నడుస్తోందని మండిపడ్డారు. "పిల్లల భవిష్యత్తును బంధకం పెట్టి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని కార్పొరేట్ రాబందులు దోచుకుంటున్నాయి. వారు చదువును కాదు.. భయాన్ని అమ్ముతున్నారు. విద్య పేరుతో పేదవాడి కలలను నెమ్మదిగా చంపేస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్మిషన్లు, స్పెషల్ ఫీజులు, డొనేషన్లు, బస్ ఫీజులు, మెటీరియల్ ఛార్జీలు.. ఇలా రకరకాల పేర్లతో ప్రైవేట్ విద్యాసంస్థలు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయని మల్లన్న దుయ్యబట్టారు. ఒక సగటు మధ్యతరగతి కుటుంబం ఆదాయం కంటే పిల్లల చదువు ఖర్చే ఎక్కువగా మారిపోయిందన్నారు. "ఒక రైతు ఏడాది పొద్దస్తమానం కష్టపడి సంపాదించిన సొమ్ము మొత్తం పిల్లాడి ఒక్క సంవత్సరపు ఫీజుకే సరిపోతే.. దీన్ని విద్యా వ్యవస్థ అనరు, బహిరంగ దోపిడీ అంటారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంత జరుగుతున్నా ప్రధాన మీడియా సంస్థలు ఈ నిరసన కార్యక్రమాలకు రాకపోవడం, ప్రజల సమస్యలను చూపించకపోవడం వెనుక కార్పొరేట్ శక్తుల హస్తం ఉందని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు యాడ్స్ (ప్రకటనల) రూపంలో కోట్లు ఖర్చు చేసి మీడియా నోరు నొక్కుతున్నాయని మల్లన్న విమర్శించారు.

రేవంత్ రెడ్డి.. చేతకాకపోతే గద్దె దిగు!

ఇతర రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ వ్యవస్థలు కఠినంగా అమలవుతుంటే, తెలంగాణలో మాత్రం ఆ పరిస్థితి ఎందుకు లేదని ప్రభుత్వాన్ని మల్లన్న నిలదీశారు. తెలంగాణలో పేద పిల్లలకు విద్యా హక్కు (=అస్త్రష్ట్ ాశీ జుఎబఎష్ఛ్అశీఅ - =ుజు) చట్టాన్ని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. "తెలంగాణలో =ుజు అమలు చేయలేరా? రేవంత్ రెడ్డి నీకు చేతకాకపోతే గద్దె దిగు!" అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## బోడుప్పల్లో ఘనంగా శ్రీవాసవిమాత జయంతి ఉత్సవాలు

**-ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక**

**పూజలు నిర్వహించిన సింగిరెడ్డి పద్మారెడ్డి**



**బోడుప్పల్:**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో శ్రీ కన్యకా పరమేశ్వరి, శివాలయ నిర్మాణ కమిటీ బోడుప్పల్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవి మాత ఆశీస్సులతో ప్రజలంతా క్షేమంగా ఉండాలని కోరుకుంటూ త్వరలో శ్రీ వాసవి మాత ఆలయ నిర్మాణం జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సీస వెంకటేష్ గౌడ్, భుక్య సుమన్, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు రాజకీయ ప్రముఖులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు

**-వేడుకలో పాల్గొన్న ఉప్పల్**

**మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్ :**
శ్రీవాసవీ మాత జయంతి సందర్భంగా ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యక పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన కుంకుమ అర్చన కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగాయి,ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు, పుష్పాభిషేకాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ కార్యక్రమంలో రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉప్పల్ ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెరగాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిక్కుమల్ల రమేష్,శెట్టి నరేష్,పాలడుగు సంపత్, బిక్కుమల్ల రాకేష్, గౌరిశెట్టి శ్రీకాంత్, రేణిగుంట కిరణ్, దాచా రాకేష్, బిక్కుమల్ల సంతోష్, చంద్ర ప్రకాష్, రేణిగుంట చరణ్,మహిళా మండలి సభ్యులు భువనేశ్వరి,పాలడుగు రాధిక,బిక్కుమళ్ళ అర్చన,బిక్కుమల్ల స్వప్న,బిక్కుమల్ల శ్రీదేవి, పాలడుగు ప్రశాంతి,దాచా స్వాతి, బిక్కుమళ్ళ అపర్ణ, తడుపునూరి స్వాతి, రేణిగుంట కళ్యాణి, ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు,

## జక్క వెంకట్ రెడ్డి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న సింగిరెడ్డి పద్మారెడ్డి



**పీర్జాదిగూడ :** పీర్జాదిగూడ మాజీ మేయర్, ఏవి కన్స్ట్రక్షన్స్ అధినేత జక్క వెంకట్ రెడ్డి గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని జక్క వెంకట్రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

**తెలంగాణలో వచ్చిదే బిజపియే**


**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్,** కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీల కలకలం: మేయర్‌కు ఫిర్యాదు

కొత్తగూడెం ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ రాజకీయ ఫ్లెక్సీలు, వ్యాపార హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంపై 'భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం' తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శనివారం సాయంత్రం సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.









**మహనీయుల ప్రాంగణాన్ని కాపాడాలి:**

ఈ సందర్భంగా డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ మేధావిగా పేరుగాంచిన అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని కొందరు తమ రాజకీయ, వ్యాపార లబ్ధి కోసం కలుషితం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది అమానవీయమని, తక్షణమే విగ్రహం చుట్టూ ఉన్న తోరణాలు, ఫ్లెక్సీలను తొలగించి ఆ ప్రాంతాన్ని 'మహనీయుల ప్రాంగణం'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విగ్రహం వద్ద లైటింగ్ ఏర్పాటు చేసి, వాటర్ ఫౌంటెన్‌ను పునరుద్ధరించాలని కోరారు.

**అతిక్రమిస్తే అట్రాసిటీ కేసులు:**

నిబంధనలు అతిక్రమించి ఫ్లెక్సీలు కట్టే వారికి రూ.5,000 జరిమానా విధించడంతో పాటు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసేలా అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అనంతరం మేయర్‌ను శాలువాతో సత్కరించారు.

**మేయర్ స్పందన:**

వినతిపై మేయర్ గణేష్ సానుకూలంగా స్పందించారు. అంబేద్కర్ అందరివాడని, ఆయన ప్రాంగణాన్ని పవిత్రంగా ఉంచేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే ప్రక్షాళన పనులు చేపట్టాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు సుబ్బారపు మధుసూదన్, అంతోటి పాల్, గుండా రమేష్, పి. సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ దెబ్బ: రూ.33 కోట్ల అప్పుతో చేతులెత్తేసిన వ్యాపారి!

ఇల్లందు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండపల్లి గణేష్ శనివారం స్థానిక కోర్టులో రూ.33.05 కోట్ల మొత్తానికి దివాళా (ఐ పి) పిటిషన్ దాఖలు చేయడం స్థానికంగా పెద్ద సంచలనంగా మారింది. రియల్ ఎస్టేట్ రంగంలో ఏర్పడిన ఒడిదుడుకులు, పెరిగిన వడ్డీల భారం వల్లే తాను ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన కోర్టుకు విన్నవించారు.

**అప్పుల ఊబిలో వ్యాపారం:**

గత కొన్నాళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం మందగించడంతో వ్యాపారంలో భారీ నష్టాలు వాటిల్లాయని గణేష్ పేర్కొన్నారు. తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక, ఆర్థికంగా పూర్తిగా కుంగిపోయానని పిటిషన్‌లో వివరించారు. ప్రస్తుతం తన వద్ద ఉన్న ఆస్తుల కంటే చెల్లించాల్సిన అప్పులే అధికంగా ఉన్నాయని, అందుకే తనను దివాళాదారుడిగా ప్రకటించాలని కోర్టును కోరారు.

**95 మందికి నోటీసులు:**

ఈ దివాళా పిటిషన్‌లో గణేష్ మొత్తం 95 మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. వీరిలో వ్యక్తిగతంగా అప్పులిచ్చిన వారు, ఫైనాన్సియర్లు ఉన్నట్లు తెలుస్తోంది. భారీ మొత్తంలో అప్పులు ఉండటం, అందులోనూ ప్రతివాదుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈ వ్యవహారం జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్, వ్యాపార వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం కోర్టు ఈ పిటిషన్‌ను స్వీకరించి, తదుపరి విచారణను చేపట్టనుంది.



# జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా న్యాయవాది భానుప్రియ

❑ **బహుజన న్యాయవాదుల గళం.. జాతీయ స్థాయికి భానుప్రియ!**

కొత్తగూడెం ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రముఖ మహిళా న్యాయవాది, సామాజిక చైతన్యశీలి సుంకర భానుప్రియకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న ప్రతిష్టాత్మక సంస్థ 'ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్' జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా ఆమె ఆదివారం ఎంపికయ్యారు. ఈ నియామకం తెలంగాణ రాష్ట్రంలోని బహుజన న్యాయవాదుల సాధికారతకు ఒక మైలురాయిగా నిలిచింది.

**విద్యే ఆయుధంగా పదేళ్ల ప్రస్థానం:**

న్యాయవాద వృత్తిలో ఉంటూనే, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం భానుప్రియ గత పదేళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నారు. ముఖ్యంగా బహుజన వర్గాలకు చెందిన నిరుద్యోగ న్యాయవాదులకు అండగా నిలుస్తూ.. జెసిజె (జీజజీ), పిపి వంటి పోటీ పరీక్షలకు ఏటా 365 రోజులు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తున్నారు. ఆమె ఆధ్వర్యంలోని ఐఎల్‌పీఏ శిక్షణ ద్వారా ఇప్పటికే వందలాది మంది జడ్జిలుగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ప్రభుత్వ సర్వీసులకు ఎంపిక కావడం విశేషం.



**కొత్త తరం న్యాయవాదులకు మార్గదర్శి:**

భావి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్న భానుప్రియ నియామకం పట్ల జిల్లా న్యాయవాద సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కోసం ఆమె చేస్తున్న ఈ 'అక్షర పోరాటం' మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా మాటేటి మధు నియామకం

ఇల్లందు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీడియా రంగంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా ఇల్లందు పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఇల్లందు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి మధు ఎన్నికయ్యారు. (నినాదం ఇల్లందు ఆర్.సి ఇంచార్జ్)గా సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన నియామకం పట్ల జిల్లావ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా మాటేటి మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రాజేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు, జిల్లా కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.



**అర్హులకు అక్రిడిటేషన్లే లక్ష్యం:**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందేలా తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఫీల్డ్‌లో కష్టపడే జర్నలిస్టులకు న్యాయం జరిగేలా కమిటీలో గళం విప్పుతానని హామీ ఇచ్చారు.


**శుభాకాంక్షల వెల్లువ:**

మాటేటి మధు నియామకం పట్ల ఇల్లందు ప్రెస్ క్లబ్ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జర్నలిస్టులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. సీనియర్ జర్నలిస్టుగా ఆయనకు ఉన్న అనుభవం కమిటీలో జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పడుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో బదిలీ

బోధన్: ఏప్రిల్ 26 జన సంఘర్షణ

నిజామాబాద్ జిల్లా బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో బదిలీ అయ్యారు. జిహెచ్ఎంసి కమిషనర్ బదిలీ చేస్తూ శనివారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ ఆయన మే 5న జిహెచ్ఎంసి కమిషనర్ గా బాధ్యతలు చేపడతారని తెలిపారు. 2022 బ్యాచ్కు చెందిన ఆయన సంవత్సరంన్నర పాటు బోధన్ సబ్ కలెక్టర్గా పని చేశారు. అలాగే బాన్సువాడ సబ్ కలెక్టర్గా పనిచేస్తున్న కిరణ్మయిని రంగారెడ్డి జిల్లాకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్గా బదిలీ అయ్యారు.



# డీసీసీ అధ్యక్షురాలిని కలిసిన ఎన్.కె.నగర్ నేతలు

భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

ఎన్.కె.నగర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వినతులపై సానుకూలంగా స్పందించిన దేవి ప్రసన్న.. సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిడిదొడ్డి సంపత్, రేగళ్ల రాజేష్, పల్లపు రాజేష్, బూతుకూరి వంశీ కృష్ణ, గుత్తుల నవీన్, ఎర్రబోయిన సదా శివరాం తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన దూదియా తండా నేతలు

కొత్తగూడెం ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

లక్ష్మీదేవిపల్లి మండలం దూదియా తండా సర్పంచ్ రమేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తండాలోని పలు పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. నేతల విన్నపంపై చైర్మన్ వీరబాబు సానుకూలంగా స్పందించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే తండాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తండా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రేపు ఇల్లందులో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

❑ **గులాబీ జెండా పండుగకు హరిప్రియ నాయక్ పిలుపు**

ఇల్లందు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేపు (ఏప్రిల్ 27) ఉదయం 8:30 గంటలకు ఇల్లందు నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ నాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో గులాబీ జెండాను రెపరెపలాడించాలని పార్టీ శ్రేణులకు హరిప్రియ నాయక్ దిశానిర్దేశం చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఇల్లందులో జరిగే ఈ ప్రధాన కార్యక్రమానికి పార్టీ కుటుంబ సభ్యులందరూ భారీగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.



# కుటుంబ వివరాలను ఆన్‌లైన్ చేసుకోండి: ఎంపీడీవో కె ధన్ సింగ్

ఇల్లందు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)


మండలంలోని ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను మొబైల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కే.ధన్ సింగ్ పిలుపునిచ్చారు. సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆన్‌లైన్ పోర్టల్ ఈనెల ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు తమ అభివృద్ధి కోసం స్పష్టమైన సమాచారాన్ని పొందుపరచాలని, ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నిర్ణీత గడువులోపు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, ఏదైనా సందేహాలు ఉంటే స్థానిక అధికారులను సంప్రదించాలని కె.ధన్ సింగ్ సూచించారు.



# బిక్నూర్ రైల్వే స్టేషన్ ప్లాటు ఫారంపై గుర్తుతెలియని వ్యక్తి

బోధన్: ఏప్రిల్ 26 జన సంఘర్షణ

బిక్నూర్ రైల్వే స్టేషన్ ప్లాటు ఫారం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఒక గుర్తుతెలియని వృద్ధుడు అందాజ 65 నుంచి 70 సంవత్సరాల గల వ్యక్తి బిక్నూర్ రైల్వే స్టేషన్ ప్లాటు ఫారం పై గుర్తుతెలియని వ్యక్తి మరణించారు. బిక్నూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు అక్కడికి వెళ్లి మృతుని పరిశీలించగా మృతుని జేబులో గద్వాల్ టు సికింద్రాబాద్ రైల్ టికెట్ ఉన్నది. అతని దగ్గర ఎలాంటి ఐడి ప్రూఫ్ లభించలేదు కాబట్టి చనిపోయిన వ్యక్తి వయసు సుమారు 65 నుండి 70 సంవత్సరములు తెల్లని గడ్డం బట్టతల, గోధుమ కలర్ ఆఫ్ టిషెట్, బ్లూ కలర్ బనియన్ లేత ఆకుపచ్చని ఫుల్ డ్రాయర్, మృతుని మెడలో రుద్రాక్ష మాల, పూసలతో కూడిన మొత్తం కలిపి మెడలో నాలుగు దండలు ఉన్నవి. శవాన్ని అతని బంధువులకు తెలియజేయుటకు ఒక ప్రకటనలో తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే రైల్వే ఎస్సై సాదు లింబాద్రి కామారెడ్డి సెల్ నెంబర్ 8712658614 కు తెలియజేయగలరు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం — తెలుగు దినపత్రిక
సోమవారం 27 ఏప్రిల్ 2026

# బెల్ట్ 'మాయా'జాలం.. కొత్తగూడెంలో ఏరులై పారుతున్న మద్యం!

- గల్లీ గల్లీకీ మద్యం.. సామాన్యుల జీవితాలు ఛిన్నాభిన్నం!

కొత్తగూడెం ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఇప్పుడు అక్రమ మద్యం వ్యాపారానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నిబంధనల ప్రకారం కేవలం లైసెన్స్ ఉన్న వైన్ షాపుల్లోనే మద్యం విక్రయాలు జరగాలి. కానీ, ఇక్కడ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రధాన కూడళ్ల నుంచి మారుమూల గల్లీల వరకు 'బెల్ట్ షాపులు' యథేచ్ఛగా వెలుస్తూ సామాన్యుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ అక్రమ దందాను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం సిండికేట్ ఇచ్చే మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి వంటి ప్రధాన మండలాల్లో సుమారు 500కు పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నట్లు సమాచారం. కిరాణా కొట్టులు, పాన్ షాపులు, చివరికి టీ కొట్టుల్లో కూడా మద్యం ఏరులై పారుతోంది. సమయంతో సంబంధం లేకుండా 24 గంటలూ మద్యం అందుబాటులో ఉండటంతో యువత, కూలీలు మద్యానికి బానిసలవుతున్నారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడమే కాకుండా, కాలేయ వ్యాధులు వంటి అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. మద్యం కోసం డబ్బులు సరిపోక కొందరు వ్యసనపరులు నేరాల బాట పడుతున్నారు. ఇటీవల ధన్బాద్ పోచమ్మ గుడిలో హుండీ పగలగొట్టి నగదు చోరీ చేసిన వ్యక్తి, ఆ తర్వాత రామవరంలోని ఒక కిరాణా షాపులో చొరబడటం కలకలం రేపింది. అక్కడ నగదుతో పాటు సుమారు 30 మద్యం బాటిళ్లను దొంగిలించడం చూస్తుంటే, కిరాణా షాపుల్లో ఎంత భారీగా మద్యం నిల్వలు ఉంటున్నాయో అర్థం చేసుకోవచ్చు. మద్యం విక్రయ కేంద్రాలుగా మారిన ఈ షాపులే దొంగలకు ప్రధాన లక్ష్యంగా మారుతున్నాయి. "బెల్ట్ షాపుల వల్ల మా కాలనీల్లో ప్రశాంతత కరువైంది" అని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులు గొడవలకు దిగుతూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, భయం భయంగా గడపాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. అక్రమ మద్యం వల్ల సామాజిక ఇబ్బందులు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి దాగి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.








ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు, ఈ అక్రమ దందాను ప్రశ్నిస్తున్న విలేఖరులపై నిర్వాహకులు బరితెగిస్తున్నారు. బెల్ట్ షాపుల గురించి వార్తలు రాస్తే కేసులు పెడతామంటూ నిర్వాహకులు బహిరంగంగానే బెదిరింపులకు దిగుతున్నారు. తమకు అధికారులు, సిండికేట్ పూర్తి అండ ఉందని, తాము ఎన్ని వార్తలు రాసినా తగ్గేది లేదని సవాల్ విసురుతున్నారు. విలేఖరులను పోలీస్ స్టేషన్‌కు రావాలని బెదిరించడం వెనుక ఉన్నతాధికారుల బలం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వరుస కథనాలతో మీడియా అక్రమాలను ఎండగడుతుంటే, దానిని తట్టుకోలేక సిండికేట్ వ్యాపారులు అధికారులను అడ్డం పెట్టుకుని బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. తమకు బెల్ట్ షాపులు నిర్వహించుకునే హక్కు ఉందని వాదించడం విడ్డూరంగా ఉంది. ఈ మొత్తం వ్యవహారంపై ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. అధికారులు వెంటనే స్పందించి బెల్ట్ షాపులను మూసివేయకపోతే బాధితుల పక్షాన ఆందోళనలు ఉధృతమయ్యే అవకాశం ఉంది.

# గుంపెల్లగూడెంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ విపత్తు...

- పంటలు బూడిద, షాక్‌తో రైతు కుప్పకూలాడు!
- స్పందించని గ్రామ పాలన అధికారి... నష్టపరిహారం కోసం రైతుల వేడుకోలు





సింగరేణి, ఏప్రిల్ 26 జన సంఘర్షణ

సింగరేణి మండలం గుంపెల్లగూడెం గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామ పరిధిలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇద్దరు రైతుల మొక్కజొన్న పంట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో రైతు గుగులోత్ వీరన్నకు చెందిన సుమారు ఆరు ఎకరాల మొక్కజొన్న పంట, అలాగే కుమ్మరి పాపారావుకు చెందిన సుమారు ఒక ఎకరం పైగా పంట దగ్ధమైంది. మంటలు వేగంగా వ్యాపించడంతో పంటను కాపాడటానికి అవకాశమే లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ, అప్పటికే మంటలు తీవ్రరూపం దాల్చడంతో పంటను రక్షించలేకపోయారు. తన కళ్లముందే పంట కాలిపోవడం చూసిన రైతు గుగులోత్ వీరన్న తీవ్ర ఆవేదనకు గురై షాక్‌తో కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన తోటి రైతులు వెంటనే ఆయనను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై వివరాలు తెలుసుకోవడానికి సంబంధిత గ్రామ పాలన అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం గమనార్హం. కనీసం ఘటనపై స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నష్టాన్ని చవిచూసిన రైతులకు ప్రభుత్వం తక్షణమే స్పందించి సరైన నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# అనుమతుల్లేకుండా ఇసుక నిల్వ.. స్వాధీనం చేసుకున్న అధికారులు

ముధోల్, ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

ముధోల్ లోని డా. రాజేశ్వర్ హాస్పిటల్ ముందు ఓపెన్ ప్లాట్‌లో అక్రమంగా ఇసుక డంప్‌లు నిల్వ ఉంచినట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీ సమయంలో అక్కడ నిల్వ ఉంచిన ఇసుకకు సంబంధించిన సరైన అనుమతులు, రవాణా పత్రాలు లేకపోవడం గుర్తించారు. దీంతో ఆ ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచినట్లు నిర్ధారించి, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీసులు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.





# బైక్ ల దొంగ అరెస్ట్

మాచారెడ్డి, ఏప్రిల్ 26 ( జన సంఘర్షణ )




కామారెడ్డి మండలం మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చుక్కాపూర్ గ్రామానికి చెందిన బాధితుడు ఇందూరి ఎల్లగౌడ్ స్కూటీ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆయన ఇచ్చిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినారు. అయితే ఈరోజు ఉదయం తులసి ఆయిల్ మిల్ వద్ద పోలీసుల తనిఖీలో అనుమానస్పదంగా కనబడిన వ్యక్తిని విచారించగా తన పేరు మరదన్నపేట మహేష్ గౌడ్ వా/శీ బాలరాజు గౌడ్, వయస్సు 34 సంవత్సరాలు, వృత్తి కూలి ధర్మారెడ్డి పల్లి గ్రామం గజ్వేల్ మండలం అని తెలిపినాడు. ఇతను గత కొద్దిరోజుల నుండి మద్యానికి బానిసై డబ్బుల కోసం బైకు దొంగతనాలు చేస్తున్నాడు. ఇతడు గతంలో బైక్ మెకానిక్ గా పనిచేయడం వలన బైకు దొంగతనాలను సులువుగా చేస్తున్నాడు.అతని వద్ద నుండి దొంగలించబడిన హోండా యాక్టివా టీజీ 17 ఏ 1786 నంబర్ గల స్కూటీ తో పాటు మూడు రోజుల క్రితం సిరిసిల్లలో దొంగలించబడిన స్ప్లెండర్ ప్లస్ బైక్ నంబర్ ఏపీ 15 క్యూ 3348 ను స్వాధీనం చేసుకొని మహేష్ గౌడ్‌ని రిమాండ్‌కు తరలించడం అయినది.

# వెల్లుట్ల పేటలో ఘనంగా గంగమ్మ తల్లి బోనాల పండుగ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -26(జన సంఘర్షణ )



మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో ఆదివారం గంగపుత్రుల సమక్షంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం అంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సాంప్రదాయ బోనాలతో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, యువత, గ్రామ పెద్దలు శోభాయాత్రగా బోనాలను తీసుకెళ్లి ఆలయంలో సమర్పించారు. భక్తుల జైజైకారాలతో గ్రామం ఆధ్యాత్మిక ఉత్సాహంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో గంగపుత్రులు ముఖ్యంగా పాల్గొని పండుగను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే గ్రామ సర్పంచ్ కొయ్యల వినోద రాజా గౌడ్, ఉప సర్పంచ్ కర్రి చెవుల రాజు యాదవ్, పెంట అంజయ్య, కొనింటి సాయిలు , కర్రెల వెంకబోయ్ ఎర్రల పోచయ్య కొట్టాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్కు తగిలిన విద్యుత్ తీగలు.. తప్పిన ప్రమాదం

బోధన్ : ఏప్రిల్ 26 జన సంఘర్షణ



నవీపేట్ మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్కు విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

# ఇల్లందులో 'విరాట్ హిందూ' సమ్మేళనం

- ఇల్లందులో కరపత్రాల ఆవిష్కరణ



ఇల్లందు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

పట్టణంలో మే 5వ తేదీ నిర్వహించనున్న 'విరాట్ హిందూ సమ్మేళనం' విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం సువర్చల సహిత ఆంజనేయస్వామి ఆలయంలో ఆహ్వాన పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు పులిగండ్ల మాధవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ మన సనాతన ధర్మం యొక్క గొప్పతనాన్ని చాటిచెప్పేందుకు ఈ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందువులంతా కులాలకు, రాజకీయాలకు అతీతంగా ఏకమవ్వాలని, సకుటుంబ సమేతంగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పింగిలి నరేష్‌తో పాటు సమితి సభ్యులు కోడూరు కాశీ విశ్వనాథ్, రవీందర్, ముద్రగడ వంశీ, బాలకిషన్ ఖండేల్వాల్, బొల్లం శ్రీనివాస్, ఇతర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొమరారం చింతలగుంపులో నీటి కష్టాలు - పరిష్కారం ఎప్పుడో?

ఇల్లందు, ఏప్రిల్ 26: (జన సంఘర్షణ )



ఇల్లందు మండలం కొమరారం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలగుంపు తండాలో గిరిజనులు తీవ్రమైన తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ ద్వారా సరైన నీటి సరఫరా లేకపోవడంతో ప్రతిసారీ నీటి కోసం కష్టాలు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కొమరారం గ్రామ కార్యదర్శి మూడు మాలు ప్రభుత్వాన్ని స్పందించాలని కోరారు. చింతలగుంపులో తాగునీటి కొరతను వెంటనే పరిష్కరించి, గిరిజనులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానికురాలు పూనెం రమాదేవి మాట్లాడుతూ.. "మిషన్ భగీరథ నీరు రాకపోతే ప్రతి రోజు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా తండాలో ఒక బోర్ వేయించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి" అని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే చింతలగుంపు ఆదివాసీ గిరిజనులతో కలిసి నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జోగా క్రిష్ణ, పూనెం నాగయ్య, వేప రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు మండలం సర్పంచులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమావేశం

ఇల్లందు, ఏప్రిల్ 26: (జన సంఘర్షణ )



ఇల్లందు మండలంలోని సర్పంచులతో గౌరవ ఎమ్మెల్యే కోరం కనకయ్య సమావేశమై గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పార్టీ బలోపేతంపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించబడింది. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయన్న విషయాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగాలని, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా సర్పంచులు వారధిలా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో స్థానిక నాయకత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, పార్టీలో చేరేందుకు ఆసక్తి ఉన్న నాయకులను చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధి, పార్టీ అభివృద్ధి రెండూ సమానంగా ముందుకు సాగాలని, భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సర్పంచులందరూ శక్తివంచన లేకుండా కృషి చేసి పార్టీని బలపరచాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాంమహేష్‌తో పాటు మండలంలోని పాయం స్వాతి, వల్లాల మంగమ్మ, అరెం ప్రియంకా, మెచ్చా సాయమ్మ, పాయం లలిత, బానోత్ శారద, సనప సావిత్రి, గుగులోత్ నాగార్జున్, తాటి యశోద, ధనసరి స్రవంతి, మూడు సరస్వతి, పూనెం స్వర్ణలత, బోడా కిషోర్, జర్పల లక్ష్మణ్, వాంకుడోత్ భారతి తదితర సర్పంచులు పాల్గొన్నారు.

## అప్పాయిగూడెం గిడ్డంగి పరిశీలన - రైతులకు నష్టపరిహారం కల్పిస్తాం

◆ **చైర్మెన్ రాంబాబు హామీ**



సింగరేణి ప్రతినిధి:( జన సంఘర్షణ )
ఇల్లందు మార్కెట్ పరిధిలోని కారేపల్లి మండలం అప్పాయిగూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిడ్డంగిని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు పరిశీలించారు. గిడ్డంగి రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులను స్థానిక సర్పంచ్ దండు ప్రవీణ్ ఆధ్వర్యంలో కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ రాంబాబు హామీ ఇచ్చారు. వైరా, ఇల్లందు శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్యల సహకారంతో రైతులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, ఇల్లందు మార్కెట్ పరిధిలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్నను రేపటి నుంచి అప్పాయిగూడెం గిడ్డంగిలో నిల్వ చేసే ప్రక్రియ ప్రారంభం కానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేత గుగులోత్ భీముడు నాయక్, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ప్రెస్ క్లబ్ కార్డుల ఆవిష్కరణలో ఎమ్మెల్యే కనకయ్య

◆ **నిజాయితీ గల జర్నలిజమే సమాజానికి శ్రీరామరక్ష**



ఇల్లందు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)
పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య నూతనంగా ఎన్నికైన ఇల్లందు ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుల గుర్తింపు కార్డులను ఆవిష్కరించి, అధ్యక్షుడు మాటేటి మధు, కార్యదర్శి తాడూరి శేఖర్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పాత్రికేయులు కేవలం వార్తలు రాసేవారు మాత్రమే కాదని, సామాన్యుడి గొంతుకగా మారి వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపే సామాజిక యోధులని కొనియాడారు. అక్షరం ఆయుధంగా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపడంలో విలేఖరుల పాత్ర వెలకట్టలేనిదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో చేరవేయడంలో వారు నిరంతరం వారధిలా నిలవాలని ఆకాంక్షించారు. బాధ్యతాయుతమైన జర్నలిజం ద్వారానే ప్రజా విశ్వాసాన్ని పొందవచ్చని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక హితానికే ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తులో ఇల్లందు ప్రెస్ క్లబ్ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు గుర్రం రాజేష్, కోశాధికారి విజ్ఞాన్, సహాయ కార్యదర్శులు శివ, చాంద్ పాషా, ప్రచార కార్యదర్శి సురేంద్రబాబుతో పాటు సీనియర్ విలేఖరులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

◆ **రాష్ట్ర ప్రభుత్వం శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగ ప్రకటించడంతో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ప్రవీణ్, సీఎంకు ధన్యవాదాలు**



కామారెడ్డి /ఏప్రిల్ 26/(జన సంఘర్షణ)
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్య వైశ్యులు ఆరాధ్య దైవమైన శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన బీర్కూర్లో ఆర్యవైశ్య సంఘం లో ఘనంగా శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఎంతో కనులు పండుగ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను తెలంగాణ అధికార పండుగగా ప్రకటించడం పట్ల బీర్కూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కర్ణగంటి ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కర్ణకంటి ప్రవీణ్ కుమార్ గుప్త,దారం నాగరాజు, మాలె నర్సింలు, కొట్టూరి సంతోష్, ఉడుత జగదీష్, సంతోష్ గుప్త, బాలాజీ, సంజు, రాకేష్, మహాజన్ చంద్రశేఖర్, మాదూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంపెళ్ల గూడెంలో అగ్నికి మొక్కజొన్న పంట బూడిద

◆ **విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం**
◆ **రెండు మోటార్లు, సుమారు 100 కేజీల పైపులు, భారీ నష్టం**

సింగరేణి : ఏప్రిల్ 26 జన సంఘర్షణ
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని గుంపెళ్ల గూడెం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదం రైతులను తీవ్రంగా కలచివేసింది. కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబాలు ఆవేదనలో మునిగిపోయాయి. గ్రామానికి చెందిన గుగులోత్ వీరన్నకు చెందిన సుమారు ఏడున్నర ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఏడాది పొడవునా అప్పులు తీసుకుని కష్టపడి పండించిన పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరగడం ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా చితికేలా చేసింది. ఇప్పటికే అప్పుల భారంతో సతమతమవుతున్న వీరన్న కుటుంబం ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో పడింది. ఈ ఘటనలో పక్కనే ఉన్న రైతు పాపారావుకు చెందిన సుమారు రెండు ఎకరాల పంట కూడా కాలిపోయింది. ఒకేసారి ఇద్దరు రైతులు నష్టపోవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. కొందరు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని భావిస్తుండగా, మరికొందరు కావాలనే మంట పెట్టి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోతకు కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడం ఈ అనుమానాలను మరింత పెంచుతోంది. విద్యుత్ లైన్ల నిర్వహణలో లోపాల వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంటలు కాలిపోయిన వెంటనే ప్రభుత్వం స్పందించి సహాయం అందించకపోవడం రైతుల్లో అసంతృప్తిని కలిగిస్తోంది. ఇక ఈ అగ్ని ప్రమాదంలో గుగులోతు వీరబాబు కృష్ణవేణి సర్పంచ్ కుటుంబానికి చెందినవారు కు చెందిన వ్యవసాయ పరికరాలు కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి. రెండు మోటార్లు, సుమారు 100 కేజీల పైపులు, స్టార్టర్లు కాలిపోవడంతో వారికి కూడా భారీ నష్టం సంభవించింది. బాధిత రైతులు తక్షణ నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.





"మేము ఏడాది మొత్తం కష్టపడి పండించిన పంట ఇలా కాలిపోతే ఎలా బతుకుతాం?" అని గుగులోత్ వీరన్న ఆవేదన వ్యక్తం చేయగా, "మా కష్టం ఒక్కసారిగా బూడిద అయిపోయింది. అని పాపారావు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిజానిజాలు బయటపెట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే బాధిత రైతులకు తక్షణ సహాయం అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఖండే బల్లూరుకు చెందిన గొర్రెల కాపరి మొగులయ్య మృతి..

బాన్సువాడ /ఏప్రిల్ 26/ (జన సంఘర్షణ)
గొర్రెలను నీటి కోసం మాజీరా బ్రిడ్జిలోని ఒక కయ్య దగ్గరకు తీసుకెళ్లడంతో గొర్రె నీళ్లు తాగడానికి వెళ్లి కయ్యలో పడడంతో దానికి కాపాడే ప్రయత్నంలో గొర్రెల కాపరి మొగులయ్య(32) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు వివరాలు తెలియాల్సి ఉంది.



## చిత్తూరు దగ్గుమల్ల ప్రసాదరావును కలిసిన డిఎస్పి వెంకటనారాయణ

చిత్తూరు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)
చిత్తూర్ డిఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంకటనారాయణ చిత్తూర్ ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశాడు. చిత్తూరులో లా లాఅండ్ ఆర్డర్ పై చర్చించారు.



## ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు


ఎల్లారెడ్డి, ఏప్రిల్ -26(జన సంఘర్షణ )
వైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి ఆర్యవైశ్య సంఘం నాయకులు పాలభిషేకం చేశారు. ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను పురస్కరించుకొని వాసవి మాత ఆలయంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్ధి శ్రీధర్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక శాసనసభ్యులు మదన్మోహన్రావుకు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ కల్వ సుజాత కు కృతజ్ఞతలు తెలుపుతూ వారి ఫ్లెక్సీకి స్థానిక ఆర్య సంఘం అధ్యక్షులు సిద్ధి శ్రీధర్ ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా సిద్ధి శ్రీధర్ మాట్లాడుతూ వైశ్యులంతా కన్న కలలు నిజం చేశారని ప్రభుత్వాన్ని కొనియాడారు. ఆర్యవైశ్యులంతా



ఐక్యంగా ఉంటే ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు.

**ఘనంగా జయంతి ఉత్సవాలు**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి అయిన వైశాఖ శుక్లపక్ష దశమి పురస్కరించుకొని వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వైశ్య జంటలు స్థానిక దొరవారి హనుమాన్ మందిరం నుంచి కలశము హారతితో పోచమ్మ గుడి వరకు ఊరేగింపు గా వెళ్లారు. ఆలయంలోని అమ్మవారికి అభిషేకం చేసి వాసవి మాత ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో కుంకుమార్చనలు, ఓడి బియ్యం, అమ్మవారి చరిత్ర సామూహిక పారాయణం జరిపారు. మధ్యాహ్నం ప్రత్యేక



పూజలు చేసి అన్నదాన వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం మంగళహారతులు దాండియా అంతాక్షరి పిల్లల సాంస్కృతిక నృత్యాలు, షోడశోపచార పూజలో నృత్యం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ప్రత్యేక హారతులు పవళింపు సేవ తోపాటు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్ గుప్తా తో పాటు వందలాది వైశ్యులు పాల్గొన్నారు.

# ఇల్లందులో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

◆ **శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ శివకిరణ్, క్రీడాకారుడు శ్రీనివాస్**

ఇల్లందు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)
పట్టణంలోని సింగరేణి గోల్స్ అండ్ రన్స్ గ్రౌండ్లో ఆదివారం 41 రోజుల ప్రభుత్వ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్, కోల్ ఇండియా ఫుట్‌బాల్ క్రీడాకారుడు జి. శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ రైసింగ్‌లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోర్ట్స్ యూత్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి వేసవి శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. నేటితరం విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, క్రీడల్లోనూ రాణించినప్పుడే పరిపూర్ణమైన వ్యక్తిత్వం అలవడుతుందని ఆయన ఆకాంక్షించారు. క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో యువత సెల్ ఫోన్లకు బానిసలై సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, అటువంటి వారు మైదానాలకు వచ్చి శిక్షణ పొందాలని శివకిరణ్ పిలుపునిచ్చారు. ఈ 41 రోజుల శిక్షణను క్రమశిక్షణతో సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. వేసవి సెలవులను విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచే క్రీడలతో గడపాలని ఆయన కోరారు. క్రీడల వల్ల కేవలం ఆరోగ్యం మాత్రమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా మెండుగా ఉంటాయని శివకిరణ్ గుర్తు చేశారు. గతంలో ఈ మైదానంలో శిక్షణ పొందిన ఎంతోమంది యువకులు స్పోర్ట్స్ కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారని వివరించారు. కష్టపడి ఆడితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చని, తద్వారా బంగారు భవిష్యత్తును నిర్మించుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ చలమల రవిచంద్ర, సంతోష్ ట్రోఫీ క్రీడాకారుడు కాకేటి రాకేష్, మాజీ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే క్రీడాకారులు కీర్తి రవి, యాసిన్, మాదాసు సుమన్, రాజేందర్ మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక క్రీడాకారుల నైపుణ్యాన్ని





మెరుగుపరిచేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయని అందరూ హర్షం వ్యక్తం చేశారు.

# గన్ని బస్తాలు లేక నిలిచిపోయిన ధాన్యం కొనుగోలు

- చోద్యం చేస్తున్న అధికారులు
- అకాల వర్షాలతో అన్నదాత ఆందోళన
- పట్టింపు లేని పాలకులు

బీర్కూర్ /ఏప్రిల్ 26/ (జన సంఘర్షణ)

అరగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకుందామని సహకార సంఘం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువస్తే అక్కడ గన బస్తాలు లేవు అంటూ బీర్కూర్ సహకార సంఘం లో పనిచేసే కార్యదర్శులు మొదలుకొని, కిందిస్థాయి సిబ్బంది వరకు రైతుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. అత్యవసర సమయంలో సహకార సంఘం కార్యదర్శి సెలవు పై వెళ్లడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టరాజ్యం కొనసాగుతుంది. కొంతమంది సహకార సంఘంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది బడా రైతులతో కుమ్మక్కై వారికి వేలాది గన్ని బస్తాలు అందజేస్తూ, చిన్న సన్న కారు రైతులకు గన్ని బస్తాలు ఇవ్వకపోవడంతో రైతులు వారి పనితీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున రైతులు సహకార సంఘం కు తరలివచ్చి అధికారుల పనితీరుపై మండిపడ్డారు. సహకార సంఘాన్ని ముట్టడించారు. ఇంతమంది సిబ్బంది వాడికి ఇష్టమైన వారికి డబ్బులు దండుకుంటూ పెద్ద ఎత్తున గన్ని బస్తాలు అందజేస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. వేలాది బస్తాలు ఉన్న బడా రైతులకు గన్ని బస్తాలు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తూ, చిన్న సన్నకారు రైతుల ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికే బీర్కూర్లో 25వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, సహకార సంఘం నిర్వాహకుల, పాలకులు, సివిల్ సప్లై అధికారులు రైతులు కావలసిన గన్ని బస్తాలు ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల, ఆరాగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాల వల్ల దెబ్బతిని ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బీర్కూర్ కు అన్నదాతలను అండగా నిలవడానికి అధికార పార్టీకి చెందిన ఏ నాయకుడు సక్రమంగా లేకపోవడంతో రైతులే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు రైతులకు అండగా నిలువలేక పోవడంతో దిక్కుతోచని పరిస్థితి రైతులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు సివిల్ సప్లై అధికారులు రైతులకు కావలసిన గన్ని బస్తాలు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నారు. దీనికి తోడు దశాబ్దాల కాలంగా బాన్సువాడ నియోజకవర్గంలో మంత్రిగా, శాసన సభాపతిగా ఎమ్మెల్యేగా విధులు నిర్వహిస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి గాని ఆగ్రో పరిశ్రమల చైర్మన్ కాసుల బాలరాజ్ పట్టించుకోకపోవడం వల్ల రైతుల పరిస్థితి దారుణంగా మారింది . రోజుకు వాతావరణం లో మార్పులు రావడం వల్ల ఏ సమయంలో అకాల వర్షాలు, వడగళ్ల వాన కురిసే ప్రమాదం ఉందని దీనివల్ల తమ ధాన్యమంతా తడిసి ముద్ద అవుతుందని అన్నదాత కంటిమీద కుంకు లేకుండా గన్ని బస్తాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. స్థానికంగా ఏ నాయకుడు కూడా అన్నదాతకు అండగా నిలవకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. విగ్రహాలకు దండాలు వేయడానికి పోటీ పడుతున్న అధికార పార్టీ నాయకులు, అన్నదాత ఎదుర్కొంటున్న గన్ని బస్తాల సమస్య



తీర్చమన్న ఆలోచన లేకపోవడం అన్నదాతలు చేసుకున్న పాపం అయింది. పక్క రెవిన్యూ అధికారులు పత్తా లేకుండా పోయారు వ్యవసాయ అధికారులు అందుబాటులో లేకపోవడంతో బాన్స్వాడ నియోజకవర్గంలోనే అత్యధికంగా ధాన్యం పండించే బీర్కూర్ మండలంలో గన్ని బస్తాలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించి రైతులు కావలసిన గన్ని బస్తాలను అందజేసి, కొనుగోలు కేంద్రాలను పెంచి తక్షణం రైతుల వద్ద ఉన్న ప్రతి గింజలు కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల అప్పుడే రైతులు పాలకులకు గుర్తుకు వస్తారు, ఎన్నికలు కాగానే గద్దెనెక్కిన పాలకులు, స్థానిక నాయకులు అన్నదాతలను మర్చిపోవడంతో అన్నదాత పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది.

# బీర్కూర్ సహకార సంఘం కార్యదర్శి సెలవుపై రైతులకు అందని గన్ని బస్తాలు

- బస్తాల కోసం సహకార సంఘాన్ని ముట్టడించిన రైతులు

బీర్కూర్ /ఏప్రిల్ 26/(జన సంఘర్షణ)

బాన్సువాడ నియోజకవర్గంలోనే అత్యధికంగా ధాన్యం పండించే మండలం బీర్కూర్ ఇక్కడ మంజీరా నది ఉండడం వల్ల పెద్ద ఎత్తున రైతులు వరిసాగు చేస్తుంటారు. ప్రతి ఏటా బీర్కూరు మండల రైతులకు కావలసిన గన్ని బస్తాలు, అమాలీలను ఏర్పాటు చేయాల్సిన సహకార సంఘం కార్యదర్శి విట్టల్ సెలవుపై వెళ్లడంతో.. ఔట్సోర్సింగ్ ఉద్యోగులే ఈ సహకార సంఘాన్ని నిర్వహిస్తున్నారు. కొంతమంది సిబ్బంది బడా రైతులతో కుమ్మక్కై వారికి కావలసిన పెద్ద ఎత్తున గన్ని బస్తాలు అప్పజెప్పి, చిన్న సన్నకారు రైతులకు గన్ని బస్తాలు ఇవ్వకపోవడంతో ఆదివారం బీర్కూర్ గ్రామానికి చెందిన 500 మంది రైతులు సహకార సంఘాన్ని ముట్టడించారు. నెల తరబడి గన్ని బస్తాలకు తిరుగుతుంటే సహకార సంఘం కిందిస్థాయి ఉద్యోగులు, కార్యదర్శి పట్టించుకోవడం లేదంటూ రైతులు పెద్ద ఎత్తున సహకార సంఘాన్ని ముట్టడించి కిందిస్థాయి సిబ్బందిపై తీవ్రంగా మండిపడ్డారు. అవసరమైన గన్ని బస్తాలు పౌర సరఫరాల శాఖ అధికారులు అందించవలసి ఉండగా, వారు చేస్తున్న నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. పెద్ద ఎత్తున ధాన్యం పండే బీర్కూర్ గ్రామానికి సుమారుగా ప్రస్తుతం 30000 బస్తాలు అవసరం ఉండగా కేవలం 4000 బస్తాలు మాత్రమే సహకార సంఘానికి చేరుకున్నాయి. వాటిని ఎవరికి ఇవ్వాల తేలక కింది స్థాయి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్షం రోజు నుంచి చిన్న సన్నాక రైతులు తమకు గన్ని బస్తాలు ఇవ్వాలంటూ




అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ సహకార సంఘం కార్యదర్శి విఠల్ నిర్లక్ష్యం కారణంగా అవసరమైన గన్ని బస్తాలు సహకార సంఘానికి చేరకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు. బీర్కూర్ గ్రామానికి 25వేల గన్ని బస్తాలు ప్రస్తుతం అవసరం ఉందని రైతులు తెలిపారు. గన్ని బస్తాలు ఒకవైపు లేకుండా, మరొకవైపు అమాలీలు లేకుండా పోవడంతో గన్ని బస్తాల కోసం అన్నదాతలు అధికారులపై మండిపడుతున్నారు. చిన్న సన్నగా రైతులకు ఆదుకోకుండా బడా రైతులకు సహకార సంఘం అధికారులు గని బస్తాలు అందిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు తీవ్రమైన ఎండలు. ఒకవైపు వాతావరణం లో ఏర్పడుతున్న మార్పుల వల్ల భారీ వర్షాలు కురిసే అన్న భయం రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. కానీ బీర్కూరు సహకార సంఘం కార్యదర్శి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఇస్తారాజ్యంగా వ్యవహరించడంతో రైతులు వారిపై మండిపడుతున్నారు. ఆదివారం పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చి సహకార సంఘాన్ని ముట్టడించారు.

తమకు తక్షణం 25 వేల గన్ని బస్తాలు పంపించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని ఆదేశించినప్పటికీ, కిందిస్థాయి అధికారుల వల్ల ధాన్యం కొనుగోలు తీవ్రంగా జాప్యం జరుగుతుంది. దీనివల్ల అన్నదాతల కడుపు మండిపోతుంది, అరగాలం ఎండనకా పగలనకా పండించిన పంట అమ్ముకుందామంటే ఒకవైపు ప్రవేటు దళారులు నిండా ఉంచుతుంటే, చివరికి సహకార సంఘాలకు అమ్ముకుందామని రైతులు ముందుకు వస్తే వారికి తగినన్ని బస్తాలు, ఖాతాలు లేకపోవడంతో నెల రోజులుగా ధాన్యం ఎండలో ఎండుతూ నూకగా మారిపోయే పరిస్థితి నెలకొనడంతో, ఈ ధాన్యమును రైస్ మిల్లర్లు కొంటారో కొనరో అన్న భయం రైతులకు బాధ కలిగిస్తుంది. అయినప్పటికీ బీర్కూర్ సహకార కార్యదర్శి సెలూవుపై వెళ్లడంతో కిందిస్థాయి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించి బీర్కూర్ సహకార సంఘానికి 25వేల గన్ని బస్తాలను అందే విధంగా పౌరసరఫరాల శాఖ అధికారులకు పై ఒత్తిడి తెచ్చి సరఫరా చేయాలంటూ రైతులు కోరుతున్నారు.

# గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో హోం శాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ షాది ఖానా ప్రారంభోత్సవం కేవలం శంకుస్థాపన శిలాఫలకంగానే మిగిలింది..!!

కోటగిరి /ఏప్రిల్ 26/ (జన సంఘర్షణ)

2022 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో హోం మంత్రి మహ్మద్ మహేముద్ అలీ కోటగిరి వచ్చిన సందర్భంలో, కొండ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో షాదీఖానా ప్రారంభోత్సవం చేశారు. కానీ దురదృష్టవశాత్తు 2026 సంవత్సరం వరకు, పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరిన తరువాత కూడా షాదీఖానా పనులు పూర్తికాలేదు, ఇంకా అధికారికంగా ప్రారంభం కూడా కాలేదు. అలాగే 2023 సంవత్సరంలో ఎన్నికల సభ స్టాండ్ గల్లి బైతుల్‌మాల్ ఎదుట నిర్వహించబడింది. ఆ సందర్భంలో కోటగిరి యువ ముస్లింలు బైతుల్‌మాల్ యొక్క దయనీయ పరిస్థితిని పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎన్నికల్లో గెలిస్తే, తన ప్రత్యేక పర్యవేక్షణలో బైతుల్‌మాల్ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు బైతుల్‌మాల్ నిర్మాణం జరగలేదు, షాదీఖానా పనులు కూడా ప్రారంభం కాలేదు. అందువల్ల పోచారం శ్రీనివాస్ రెడ్డికి వినతి చేసుకుంటున్నాము. ఈ ముఖ్యమైన సమస్యపై తక్షణం, ప్రత్యేక శ్రద్ధ చూపించి, తమ హామీలను నెరవేర్చాలని, కోటగిరి ముస్లింల న్యాయమైన డిమాండ్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరుతున్నాము.



# సూళ్లూరుపేట పట్టణంలో జాతీయస్వీయ జనగణన అవగాహనకు 5కే రన్ విజయవంతం

సూళ్లూరుపేట ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)




తిరుపతి జిల్లా సూళ్లూరు పేట పట్టణంలో నిర్వహించిన జాతీయ స్వీయ జనగణపై ప్రజల్లో అవగాహన పెంపొంది ంచేందుకు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో 5కే రన్ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఆదివారం తెల్లవారుజామున షార్ వై జంక్షన్ నుంచి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు సాగిన ఈ 5కే రన్‌ను ఆర్డీఓ దేవేందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. యువతీ యువకులు, సీనియర్ సిటిజన్లు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి చైతన్యం నింపారు. పోటీ ఫలితాలలో పురుషుల విభాగంలో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో స్క్రాబ్ విభాగంలో పనిచేస్తున్న బిజ్జం చంద్రారెడ్డి తొలి స్థానాన్ని కైవసం చేసుకోగా, అభిలాష్, రవి వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో తన్మయి, జీవిక, స్వాతి వరుసగా మొదటి మూడు స్థానాలను సాధించారు. సీనియర్ సిటిజన్లు కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ శైల కుమారి, ఎస్ఐ అజయ్ కుమార్, ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న కమిషనర్ చిన్నయ్య, ఈ 5కే రన్‌ను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, విస్తృతంగా ప్రజలను భాగస్వామ్యం చేయడం విశేషంగా నిలిచింది.

# పెట్రోల్ దుకాణాలు పరిశీలించిన...తాసిల్దార్ భారతి





తొట్టంబేడు ఏప్రిల్ 26 (జన సంఘర్షణ)

పెట్రోల్, డీజిల్ కొరత ఉందని తాసిల్దార్ దృష్టికి రావడంతో ఆదివారం తొట్టంబేడు భారతి మండల పరిధిలో ఉన్న పెట్రోల్ బంకులను పరిశీలించారు. ఇంధన సరఫరాలో తాత్కాలిక అంతరాయాల వల్లనే కొన్ని బంకులు డీజిల్ రాలేదని , స్టాక్ ఉందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. డీలర్లు కొనుగోల విషయంలో ఇంధన సరఫరాలో లోపం వల్లే కొన్నిచోట్ల బంకుల సకాలంలో డీజిల్ రాలేదని అన్నారు. పెట్రోల్ డీజిల్ పైన వస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని.. ఈ విషయంలో ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్నారు. మండలంలో ఉన్న ఎంజీఎం, కన్నలి పెట్రోల్ బంక్ , కొత్త కంద్రిగబంక్, రిలయన్స్ అండ్ జియో, పెట్రోల్ బంకుల వద్ద తనిఖీలు చేపట్టాలని.. రేపటి నుంచి శ్రీకాళహస్తి, తొట్టంబేడులో ప్రజలకు డీజిల్ పెట్రోలు అందుబాటులో వస్తుందని వాహనదారులు, రైతులు ఆందోళనచందవలసిన అవసరం లేదని తెలియజేశారు.

# ఎస్ఆర్ పురం మహాభారతంలో అలరించిన దుర్యోధన వధ

- యుద్ధ సన్నివేశంలో ఎండ వేడిమికి తట్టుకోలేక స్ప్రైట్ తాగుతున్న బీముడు

(జన సంఘర్షణ)



ఎస్ఆర్ పురం శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆల యం వద్ద ఎస్ఆర్ పురం మహా భారత ఉత్సవంలో భాగ ంగా ఆదివారం దుర్యోధన వద అందరిని ఆకట్టు కుంది దుర్యోధన వధ సన్నివేశంలో ఎండ వేడిమికి తట్టు కోలేక దాహానికి భీముడు స్ప్రైట్ తాగుతు యుద్ధ సన్నివేశం అందర్నీ ఆకట్టుకుంది. గంగ మడుగులో దాక్కున్న దుర్యోధడుని శ్రీకృష్ణుడు సహాయంతో దుర్యోధుడిని బయటికి తీసుకువచ్చి భీముడు దుర్యోధనుని బోధిస్తాడు.. భీముడు వేషధారిగా బాబు దుర్యోధన వేషధారిగా గోవిందరాజులు యుద్ధ సన్నివేశం లో పాడిన పాటలు అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మహాభారత ఉత్సవ నిర్వాహకులు ఎత్తి రాజుల నాయుడు ప్రకాష్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, గొల్లపల్లి సుబ్రహ్మణ్యం నాయుడు, వేణు నాయుడు, నారాయణస్వామి, కేశవల్ నాయుడు, మాధవ నాయుడు, నాయుడు మైక్ సెట్ రూప్ కుమార్ పాల్గొన్నారు.

# మక్తల్ లో వైభవంగా శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలు

**- శ్రీ పడమటి ఆంజనేయస్వామి పుష్కరిణి (కోనేరు) లో ప్రత్యేక కలశ పూజలు**

**- శోభాయమానంగా 108 మంది కన్నెపిల్లలచే కలశ ఊరేగింపు**

**- పట్టణ పురవీధుల గుండా శోభయామానంగా రథోత్సవంలో అమ్మవారి ఊరేగింపు**




**మక్తల్, ఏప్రిల్ 26**

నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి పుష్కరిణి (కోనేరు) నుండి 108 మంది కన్నెపిల్లలచే కలశ ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. కోనేరులో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి రథోత్సవంలో అమ్మవారి చిత్రపటాన్ని ఉంచి కలశ ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా శోభాయానమానంగా కొనసాగింది.చిన్నారులు, మహిళలు, పురుషులు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. దారిపొడవునా వాసవి మాత భజన సంకీర్తనలతో, సన్నాయి వాయిద్యాలతో కొనసాగింది.అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి చివరగా అమ్మవారి మూల విరాట్ కు అర్చకుల వేదమంత్రోశ్చరణల మధ్య 108 కలిశాల పుష్కరిణి నీటితో అభిషేకం నిర్వహిం చారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ చైర్మన్ కొత్త శ్రీనివాస్ గుప్తా ,ఆల య అధ్యక్షులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, ఆర్యవైశ్య సం ఘం నాయకులు కొత్త జగదీష్ గుప్తా, మనసాని వెంకటేష్, దొంత నరహరి, మనసాని నాగరాజు, బిలకంటి జగదీష్, బిలకంటి నర్సయ్య, ఆళ్లగడ్డ శ్రీనివాస్, వాసవి రాము ,గుగ్గి ళ్ళ కృష్ణయ్య , ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకులు కొత్త విజయలక్ష్మి ,కొత్త మీరాబాయి, మనసాని సరళ, వాసవి క్లబ్ అధ్యక్షులు మేడిశెట్టి హరికృష్ణ , వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వాల ప్రసన్న కిషోర్ ,సభ్యులు కట్ట ఉషారాణి, మనసాని దేవి,బి.పద్మ,అగ్లార్ లక్ష్మి,పాలుట్ల సుష్మ ,చల్లా రూప, గుగ్గిళ్ళ శోభ, పల్లవి, పద్మావతి, శారద ,శ్రీలత ,అగ్లార్ రేఖ ,తదితరులు పాల్గొన్నారు.

# ఆడపడుచు పెళ్లికి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత పెళ్లి కానుక

**వలిగొండ ఏప్రిల్ 26**

మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన దుబ్బ లక్ష్మీబాయి ,అంజయ్య కుమార్తె ప్రియాంక వివాహం ఆదివారం ఎంఎంఎస్ ఫంక్షన్ హాల్ లో జరగగా ఆ వివాహ వేడుకకు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి 10000/-రూపాయలు ఆడపడుచు కానుక ˇగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గ్రామ యువత పాల్గొన్నారు.



# చిన్నారులను ఆశీర్వదించిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత



**వలిగొండ ఏప్రిల్ 26**

వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బెలిదే దామోదర్ కుమారులు ఈశ్వర్, శ్రీనివాస్ ల కూతురు మరియు కొడుకుల సారీ ఢధోతి ఫంక్షన్ సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరుగగా ఆ ఫంక్షన్ కు ఏజేఅర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

# కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా వాసవిమాత జయంతి ఉత్సవాలు

**- వాసవి మాత చిత్రపటానికి పూలమాలవేస్తూ జయంతి ఉత్సవాల నిర్వహించిన అధికారులు**





**నారాయణపేట, ఏప్రిల్ 26**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము మొదటిసారిగా శ్రీవాసవి మాత జయంతిని ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాలమేరకు ఆదివారం స్థానిక కలెక్టరేట్ లో ప్రజావాణి ఆఫీస్ నందు జిల్లా క్రీడా శాఖ అధికారి శెట్టి వెంకటేష్ ఏవో శ్రీధర్ ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం నకు నారాయణ పేట జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సుంకు ఉమేష్ , రాష్ట ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధి కొత్త శ్రీని వాస్ గుప్తా మాట్లాడుతూ వాసవి మాత జయంతిని అధి కారికంగా ప్రకటించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, స్థానిక మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి కి , కల్వ సుజాత కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ జనరల్ సెక్రటరీ శ్రీ కట్టా సురేష్ , శ్రీనివాస్ శెట్టి,సతీష్ పాలాది,డాక్టర్ శివ ప్రసాద్, బొడ్డు శివప్రసాద్ పూరి వెంకటేష్,జగదీశ్ మరియు అనుపూర్ రఘునాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబానికి బియ్యం అందజేత



**తుర్కపల్లి, ఏప్రిల్ 26**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామానికి చెందిన శ్యాగ రామచందర్ మరణించడంతో ఆయన కుటుంబానికి 50 కిలోల బియ్యం, గ్రామానికి చెందిన జూపల్లి రమణమ్మ మరణించడంతో ఆమె కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. శ్యాగ రామచందర్ కుటుంబానికి గ్రామ సర్పంచ్ బొత్త రాములు 2000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి బాలరాజు కాంగ్రెస్ నాయకులు పెద్ద గొల్ల కిష్టయ్య ఓబిసి అధ్యక్షుడు జూపల్లి తిరుపతి గ్రామ ఉపాధ్యక్షుడు శ్యాగ బాలరాజు, వార్డు సభ్యుడు గడిపే నర్సింలు , శ్యా గ మల్లేశం,

# జిడికె 11వ ఇంక్లైన్ లో మూడో చైర్ లిఫ్ట్ ను త్వరగా ప్రారంభించండి

**:- ఎల్.హెచ్.డి సెక్షన్ లో గాలి, నీరు,వెలుతురు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.**

**:- కార్మికుల సమస్యలపై మేనేజర్ తో చర్చించిన ఏఐటియుసి నాయకులు.**



**గోదావరిఖని,ఏప్రిల్ 26 :-**

సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జీడికే 11వ ఇంక్లైన్ లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గని మేనేజర్ తో చర్చించడం జరిగిందని గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్,బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో గాలి,నీరు సరఫరా సరిగా లేకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మెరుగైన గాలి సరఫరా లేకుండా కార్మికులను విధులు నిర్వహించమని యాజమాన్యం ఒత్తిడి చేయడం సరైనది కాదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు మేనేజర్ ను కోరారు.అదేవిధంగా కార్మికులకు తగినన్ని పనిముట్లు అందించడం లేదని వాటిని పూర్తిగా సరఫరా చేయాలని కోరారు,విధులకు వెళుతున్న కార్మికులకు చైర్ కార్లు సరిపడా లేవని,వాటి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎల్.హెచ్.డి సెక్షన్ లో మూడో

# జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులుగా తాన్ సింగ్ రాజ్ పురోహిత్

**- ప్రధాన కార్యదర్శి బి.గోపాలం**

**- సర్వసభ్య సమావేశంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక**

**మక్తల్, ఏప్రిల్ 26**

తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆదేశాల మేరకు ఈ నెల ఆదివారం మక్తల్ ప్రాథమిక పాఠశాల లో నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశము, ఎన్నికల సమావేశాన్ని అధ్యక్షుడు తాన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా మహబూబ్నగర్ జిల్లా సీనియర్ అడ్వకేట్ ఏ. అడమ్స్, మక్తల్ సీనియర్ అడ్వకేట్ సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో జిల్లా ఎన్నికలను నిర్వహించి ఏకగ్రీవంగా ఈ క్రింది కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

**జిల్లా నూతన కమిటీ....**

నారాయణపేట జిల్లా నూతన సైకలింగ్అసోసియేషన్ అధ్యక్షులుగా తాన్ సింగ్ రాజ్ పురోహిత్, ఉపాధ్యక్షులుగా విష్ణువర్ధన్ రెడ్డి, అబ్దుల్ రావూఫ్, మీనా కుమారి పిఈటి, ప్రధాన కార్యదర్శి బి.గోపాలం, సంయుక్త కార్యదర్శులు బి. అంబదాస్, ఏ. శ్రీవాణి పీఈటి, కోశాధికారి బీ.రూప పిడి, నిర్వాహణ కార్యదర్శి బి .దామోదర్,పిఈటి. కార్యవర్గ సభ్యులు, ఏ .రేణుక పిడి, జి .చంద్రకళ పిఈటి,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులుగా పాత్ర పోషించిన సూర్య ప్రకాష్ అడ్వకేట్ ,ఏ .అడమ్స్ అడ్వకేట్, పరిశీలికులుగా టి. సి.ఎ. రాష్ట్ర



పరిశీలకులు జే. పాండు, మహబూబ్నగర్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్ ,నారాయణపేట జిల్లా క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి హాజరై నారాయణపేట జిల్లా నూతన సైకిలింగ్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ప్రకటించి ,ఘనంగా సన్మానించి అభినందించారు. నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా తాన్ సింగ్ రాజ్ పురోహిత్, ఉపాధ్యక్షులుగా విష్ణువర్ధన్ రెడ్డి, అబ్దుల్ రావూఫ్, మీనా కుమారి, ప్రధాన కార్యదర్శిగా బి.గోపాలం, సంయుక్త కార్యదర్శి లాగా అంబదాస్, శ్రీవాణి పీఈటి, కోశాధికారిగా బి.రూప. పిడి ,నిర్వాణ కార్యదర్శిగా బి .దామోదర్ పిఈటి, కార్యవర్గ సభ్యులుగా ఏ .రేణుక పిడి, జి. చంద్రకళ, పి ఈ టి, ఏకగ్రీవంగా ఎన్నుకొని వారిని ఘనంగా సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ సైక్లింగ్ అసోసియేషన్ ద్వారా నారాయణపేట జిల్లా క్రీడాకారులను రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ సాయి క్రీడల్లో పాల్గొని విధంగా ప్రోత్సహించి సహాయ సహకారాలు అందజేస్తామని వారు తెలిపారు. జిల్లా డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి మాట్లాడుతూ సైకలింగ్ క్రీడాకారులకు పూర్తి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. జిల్లా పరశీలికులుగా, జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన న్యాయవాదులు ఏ. ఆడమ్స్, సూర్యప్రకాష్, జిల్లా పరిశీలకులు జిల్లా క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి,మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న బి.గోపాలమును అభినందిస్తూ, ఆయన కృషి అమోఘమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచే కలం...నిజం కోసం నడిచే గళం

**TR9 Tv ఛానల్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి పూదరి సంతోష్ కుమార్ కీ హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు**

**ఏప్రిల్ 26,2026,**

**ఓల్డ్ బోయినపల్లి, సికింద్రాబాద్**

**వార్త అంటే బాధ్యత... అదే సంతోష్ జీవన సూత్రం"**

ప్రస్తుతం మీడియా రంగం వేగంగా మారుతున్న కాలంలో నిజం నిలబెట్టడం ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే అలాంటి పరిస్థితుల్లోనూ విలువలు, నైతికతలను కాపాడుకుంటూ ముందుకు సాగుతున్న వ్యక్తుల్లో TR9 Tv తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి సంతోష్ ఒకరు. ఆయనకు వార్త అంటే కేవలం సమాచారం కాదు... అది ఒక సామాజిక బాధ్యత. బాధితుల వేదనను వినిపించడం, వారి గొంతుకగా మారడం, సమాజంలో మార్పుకు కారణం కావడం ఇవే ఆయన జర్నలిజం యొక్క అసలు అర్థం.

**ప్రజల గుండెల్లో చోటు సంపాదించిన మీడియా యోధుడు**

సంతోష్ పని తీరు చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది ఆయన జర్నలిస్టు మాత్రమే కాదు, ప్రజల కోసం పోరాడే యోధుడు. చిన్న చిన్న సమస్యల నుండి పెద్ద పెద్ద అన్యాయాల వరకూ... ప్రతి అంశాన్ని సమానంగా చూసి ప్రజల పక్షాన నిలబడే ధైర్యం ఆయనలో ఉంది. అందుకే ఆయన పేరు వినగానే ప్రజల్లో ఒక నమ్మకం, ఒక ఆశ కలుగుతుంది.

**నాయకత్వం అంటే మార్గం చూపడం... అదే ఆయన ప్రత్యేకత**

ఒక మంచి నాయకుడు అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు... తనతో ఉన్న వారిని ముందుకు నడిపించడం. సంతోష్ అదే చేస్తున్నారు. TR9 Tv లో పనిచేస్తున్న ప్రతి రిపోర్టర్లో నిబద్ధత, ధైర్యం, నిజాయితీ అనే విలువలను నింపుతూ వారిని మంచి జర్నలిస్టులుగా తీర్చిదిద్దుతున్నారు. ఆయన చూపించే మార్గం అనేకమందికి స్ఫూర్తిగా మారింది.

**ఒత్తిడులు వచ్చినా... సత్యం వైపు అడుగులు ఆగవు"**

నిజం చెప్పే మార్గంలో ఎన్నో అడ్డంకులు వస్తాయి. బెదిరింపులు, ఒత్తిడులు, విమర్శలు ఇవన్నీ సాధారణమే. కానీ సంతోష్ ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. ప్రజల పక్షాన నిలబడి నిజాన్ని బయటపెట్టడంలో ఆయన చూపించే ధైర్యం ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతోంది. అదే ఆయనను నిజమైన మీడియా సైనికుడిగా నిలిపింది.

**ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం"**

ప్రజల ఇబ్బందులను తన ఇబ్బందులుగా భావించి, వాటి పరిష్కారం కోసం కృషి చేయడం సంతోష్ అసలు గొప్పతనం. ఆయన కథనాలు కేవలం ప్రసారం అయ్యే వార్తలు కాదు... అవి మార్పుకు దారి తీసే శక్తివంతమైన ఆయుధాలు. అధికారులను స్పందింపజేసేలా, బాధితులకు న్యాయం జరిగేలా ఆయన చేసే కృషి అభినందనీయం.

**మీడియా విలువలను నిలబెట్టిన వ్యక్తిత్వం"**

ఇప్పటి పరిస్థితుల్లో మీడియా మీద విశ్వాసం తగ్గుతున్న సమయంలో, సంతోష్ ఆ విశ్వాసాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నిజాయితీ, పారదర్శకత, నిబద్ధత ఈ మూడు విలువలతో ఆయన పనిచేస్తున్నారు. అదే ఆయనను ఇతరుల కంటే భిన్నంగా నిలబెడుతోంది.

**యువతకు మార్గదర్శి... స్ఫూర్తిదాయక నాయకుడు"**

మీడియా రంగంలో అడుగుపెట్టే యువతకు సంతోష్ ఒక ప్రేరణ.




కష్టపడితే ఎలా ఎదగాలో, నిజాయితీతో ఎలా నిలబడాలో ఆయన జీవితం ద్వారా తెలుస్తుంది. ఆయన చూపించే మార్గం అనేక యువ జర్నలిస్టుల భవిష్యత్తును తీర్చిదిద్దుతోంది.

**జన్మదినం... సేవా ప్రస్థానానికి నూతన దిశ"**

ఈ ప్రత్యేక సందర్భంలో సంతోష్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ... ఆయన చేపట్టిన ప్రజాసేవా ప్రయాణం మరింత విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను ఆరోగ్యంగా, ఆనందంగా ఉండి ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను .

**నిజం కోసం కలం... ప్రజల కోసం గళం... అదే సంతోష్**

ప్రజల కోసం ఎప్పుడూ ముందుండే నాయకుడు... నిజం కోసం నిరంతరం పోరాడే జర్నలిస్టు...ఇదే TR9 Tv రాష్ట్ర ఇంచార్జి సంతోష్ అసలైన గుర్తింపు.మరొక్క సారి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు సంతోష్ అన్న మీ ప్రయాణం ఇంకా ఎన్నో విజయాలతో నిండాలి!

**డోంగ్రీ రవీందర్ TR9 Tv కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

వలిగొండ ఏప్రిల్ 26 పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించుకుని జీవితంలో స్థిరపడాలని బీడీఎఫ్ వ్యవస్థాపకులు మెరుగు మధు, ట్రస్మా జిల్లా అధ్యక్షులు పాలకుర్ల వెంకటేశంగౌడ్ అన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో స్థానిక శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో మైత్రి అకాడమీ, నల్గొండ ఆధ్వర్యంలో ట్రస్మా సహకారంతో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పదో తరగతి అనంతరం అందుబాటులో ఉన్న వివిధ డిప్లమా కోర్సులు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంట్రెన్స్ పరీక్షలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మైత్రి అకాడమీ చైర్మన్ పాముల అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ పదో తరగతి అనంతరం సిఐటిడి ప్లాస్టిక్ టెక్నాలజీ, పాలిటెక్నిక్ వంటి ఎంట్రెన్స్ పరీక్షల ద్వారా డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలు పొందే అవకాశాలు విస్తారంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధిర మల్లేశం మాట్లాడుతూ, పోటీ పరీక్షలపై అవగాహన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కే సాయిరాం, స్వామి, నరసింహ చారి, తిరుపతి శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co